క్లుప్తంగా

ఓట్ల తొలగింపుపై ఇంటింటి సర్వే

ఆర్డీవో ప్రభాకరరెడ్డి



పెదనందిపాడు: గతంలో తొలగించిన ఓట్లుపై ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు గుంటూరు ఆర్డీవో ప్రభాకరరెడ్డి తెలిపారు. గురువారం మధ్యాహ్నం పెదనందిపాడులో తొలగించిన ఓట్లపై ఆయన సర్వే చేపట్టారు. 2022 జనవరి నుంచి ఇప్పటి వరకు తొలగించిన ఓట్లను ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు తనిఖీ చేస్తున్నట్లు వెల్లడించారు. నిబంధనలు పాటించకుండా.. ఎవరి ఓటు అయినా తొలగిస్తే.. వాటిని పరిశీలించి, న్యాయం చేస్తామని ఆర్డీఓ చెప్పారు. బీఎల్‌వోలు నిష్పక్షపాతంగా పనిచేస్తున్నారా.. లేదా తనిఖీ చేస్తున్నట్లు వెల్లడించారు. తహసీల్దారు సుభాని, ఆర్‌ఐ మల్లేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం తాగిన వ్యక్తిపై..

పెదకాకాని: మద్యం తాగిన వ్యక్తిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసిన ఘటన మద్దిరాల కాలనీలో చోటు చేసుకుంది. మద్దిరాల కాలనీ వాసి బత్తుల ఏడుకొండలు బుధవారం రాత్రి సమీపంలో ఉన్న ఓ బార్‌లో మద్యం సేవించాడు. అదే సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు కొందరు అతనిపై కర్రలతో దాడి చేశారు. బాధితుడు ఏడుకొండలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు గురువారం సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రానికి శంకుస్థాపన

తెనాలి: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, తెనాలి శాఖ ఆధ్వర్యంలో పాత ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేస్తున్న రక్తనిధి కేంద్రంలో సివిల్ పనులకు గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ శంకుస్థాపన చేశారు. రెడ్‌క్రాస్ తెనాలి చైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతి ఆధ్వర్యంలో రూ.72 లక్షల వ్యయంతో ఈ పనుల్ని చేపట్టారు. దసరా నాటికి రక్తనిధి కేంద్రం ప్రారంభించనున్నట్లు భానుమతి చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం కావాల్సినపుడు గుంటూరు, విజయవాడకు వెళ్లాల్సిన పనిలేకుండా అవసరమైన రక్త యూనిట్లను రక్తనిధి నుంచి పొందే అవకాశం ఉందని తెలిపారు. రక్తం అవసరమైన రోగికి, చికిత్స చేస్తున్న వైద్యుడు సిఫార్సు చేసిన గ్రూపు రక్తాన్ని ఇక్కడ అందించే ఏర్పాట్లు ఉంటాయని మున్సిపల్ వైస్ చైర్మన్, ఆ వార్డు కౌన్సిలరు మాలేపాటి హరిప్రసాద్ చెప్పారు. రక్తకేంద్రానికి స్థలం కేటాయించిన ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ పావనీ ప్రియాంక, డాక్టర్ బీబీజాన్, 13వ వార్డు కౌన్సిలరు కుర్రా సుజాత, రెడ్‌క్రాస్ కోశాధికారి నాళం శ్రీమన్నారాయణ, ఈసీ సభ్యుడు కుర్రా శ్రీను, జవ్వాజి శ్రీను, సాయి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మళ్లీ తెరపైకి ఆక్రమణలు

- ఆక్రమణలకు గురైన రక్షిత మంచినీటి చెరువు, చిన్న చెరువు, శ్మశానవాటికలు
- ఆక్రమితదారులకు ప్రత్తిపాడు పంచాయతీ నోటీసులు
- స్వచ్ఛందంగా తొలగించుకునేందుకు వారం రోజుల గడువు
- దశాబ్దాలుగా ముందుకు సాగని శ్మశాన వాటిక ఆక్రమణల తొలగింపు



ఆక్రమిత స్థలాలను పరిశీలిస్తున్న ఈవోపీఆర్డీ మావులూరి మోషె, సెక్రటరీ జాన్ పీరా

ప్రత్తిపాడు: మరోమారు ఆక్రమణల తొలగింపు అంశం తెరపైకి వచ్చింది. ప్రత్తిపాడు పంచాయతీ పరిధిలోని రక్షిత మంచినీటి చెరువు ఆక్రమణలకు గురయ్యిందంటూ గతంలో పెదగొట్టిపాడుకు చెందిన పచ్చల కోటేశ్వరరావు లోకాయుక్తలో పిర్యాదు చేయడం, లోకాయుక్త ఆదేశాల మేరకు రెవెన్యూ, పంచాయతీ అధికారులు కలిసి ఆక్రమణకు గురైన సుమారు ఆరు ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా చెరువు కట్టకు ఆనుకుని ఉన్న ఇళ్లకు తాళాలు వేసి, ఖాళీ చేయించారు. కానీ ఆ తరువాత కొంత కాలానికి ఈ ఇళ్లు తిరిగి వినియోగంలోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో కొద్ది రోజుల కిందట రక్షిత మంచినీటి చెరువు ఆక్రమణలు తొలగించాలంటూ ప్రత్తిపాడుకు చెందిన కమ్మా శివప్రసాద్, చిన్న చెరువు (రజక చెరువు), శ్మశానవాటిక ఆక్రమణలు తొలగించాలంటూ పడబక్కల పరమేశ్వరరావు విడివిడిగా స్పందనలో ఫిర్యాదులు చేశారు. దీంతో సంబంధిత ఆక్రమణలను ఈవోపీఆర్డీ మావులూరి మోషె పంచాయతీ కార్యదర్శి జాన్‌పీరాతో కలిసి పరిశీలించారు.

34 మందికి నోటీసులు..

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం పంచాయతీ కార్యదర్శి జాన్‌పీరా ఆక్రమితదారులకు నోటీసులు అందజేశారు. జీవో నంబరు 188 ప్రకారం రక్షిత మంచినీటి చెరువును ఆక్రమించుకున్న నలుగురికి, చిన్న చెరువు, శ్మశాన వాటిక స్థలాలు ఆక్రమించుకున్న 30 మందికి పంచాయతీ కార్యదర్శి నోటీసులు అందజేశారు. వారం రోజుల్లోగా ఆక్రమణలు తొలగించాలని అందులో పేర్కొన్నారు. అయితే హిందూ శ్మశాన వాటిక ఆక్రమణల తొలగింపు అంశం దశాబ్దాల తరబడి పెండింగ్ పడుతూ వస్తుంది. గతంలో స్థానిక ఎమ్మెల్యే సుచరిత హోంమంత్రిగా ఉన్న సమయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో గ్రామస్తులు శ్మశాన వాటిక ఆక్రమణలు తొలగించాలని కోరడంతో తహసీల్దార్‌కు ఆదేశాలు జారీ చేశారు. వెంటనే అప్పటి తహసీల్దారు పూర్ణచంద్రరావు సర్వే పూర్తి చేసి, ఆక్రమణలను నిర్ధారించినప్పటికీ, ఆ తర్వాత ఆ అంశం మరుగున పడిపోయింది. ఈ తరుణంలో ఇప్పుడు శ్మశాన వాటిక ఆక్రమణదారులకు కూడా నోటీసులివ్వడం శుభపరిణామంగా గ్రామస్తులు భావిస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు తాత్సారం చేయకుండా చెరువులు, శ్మశాన వాటికల ఆక్రమణలు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వారం రోజుల్లో తొలగించాలి



రక్షిత మంచి నీటి చెరువు, చిన్న చెరువు, శ్మశాన వాటికలు ఆక్రమణలకు గురయ్యాయని వేర్వేరుగా స్పందనలో ఫిర్యాదులొచ్చాయి. పరిశీలించిన అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 34 మంది ఆక్రమితదారులకు నోటీసులు అందజేశాం. నోటీసులకు స్పందించి వారం రోజుల్లో ఆక్రమితదారులు తమ అక్రమ కట్టడాలు, నిర్మాణాలను తొలగించాలి. లేదంటే పంచాయతీనే ఆక్రమణలు తొలగించి, అందుకు అయిన ఖర్చును వారి నుంచే వసూలు చేస్తుంది. స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించి పంచాయతీకి సహకరించాలి.

– జాన్ పీరా, కార్యదర్శి, ప్రత్తిపాడు పంచాయతీ

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య
- మాచవరంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



మహిళకు సంక్షేమ కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

చేబ్రోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు మంజూరు చేస్తూ, ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు అందజేస్తున్నారని పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. పొన్నూరు మండలం మాచవరం గ్రామంలో గురువారం రెండోరోజు ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరించి, కరపత్రాలను అందజేశారు. గడప గడపకు వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిలారి మాట్లాడారు. ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని అవినీతికి తావులేకుండా పారదర్శకంగా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. దీనిని ఓర్వలేని ప్రతిపక్షాలు దుష్ప్రచారాలు చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రజలను అన్ని విధాలుగా ఆదుకుంటున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మనస్ఫూర్తిగా దీవించాలని ఆయన కోరారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి సీఎం నిధులు కేటాయిస్తున్నట్లు ఎమ్మెల్యే కిలారి తెలిపారు. రాష్ట్రంలో అమలవుతున్న గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లు దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ఎమ్మెల్యే వెంట గ్రామ సర్పంచి మిక్కిలి సునీత, ఎంపీటీసీ తలతోటి ఏసు మరియమ్మ, బాబురావు, వినోద్, ఎంపీపీ భవనం పద్మలీల, ఏఎంసీ చైర్మన్ ఎ.వెంకటేశ్వరరావు, పెరికల కృష్ణమోహన్, బి.రంగారావు, రుద్రపాటి ఆదిశేషు, మోపర్తి ప్రమీల పాల్గొన్నారు.

చంద్రయాన్‌-3 విజయోత్సవం



విజయోత్సవ ర్యాలీలో ఎమ్మెల్యే కిలారి, పార్టీ నాయకులు

- ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య
- భారీ జాతీయ జెండాతో ర్యాలీ

పొన్నూరు(చేబ్రోలు): చంద్రయాన్–3 భారతీయుల విజయ గీతిక అని పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. పొన్నూరు పట్టణంలోని చైతన్య స్కూల్‌లో గురువారం చంద్రయాన్ – 3 విజయవంతంపై విద్యార్థులతో ఆయన మాట్లాడారు. పట్టణంలోని ప్రధాన రహదారిలో భారత్ మాతాకీ జై.. నినాదం చేస్తూ.. జయహో భారత్ అంటూ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, వైఎస్సార్ సీపీ నాయకులు 50 మీటర్ల భారీ జాతీయ జెండాతో ర్యాలీలో పాల్గొన్నారు. ఐలాండ్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. ఎమ్మెల్యే కిలారి మాట్లాడుతూ చంద్రయాన్–3 విజయంతో భారత వైజ్ఞానిక సత్తా ప్రపంచానికి చాటిందన్నారు. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి తమ కలలను సాకారం చేసుకొని దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు.

ఆర్‌వీఆర్‌జేసీలో వేడుకలు

గుంటూరు రూరల్: అంతరిక్ష పరిశోధనలలో చంద్రయాన్ –3 విజయం ఒక మహత్తర ఘట్టమని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం కళాశాలలో చంద్రయాన్ 3 విజయయోత్సవం నిర్వహించారు. ఆనందోత్సాహాలతో ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

డ్వామా పీడీ యుగంధర్



సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ యుగంధర్ కుమార్

పెదనందిపాడు: ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని డ్వామా పీడీ డాక్టర్ ఎం.యుగంధర్ కుమార్ అన్నారు. గురువారం ఉదయం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన షోషల్ అడిట్ ప్రజా వేదికలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉపాధి హామికి పథకంలో ఎలాంటి అవకతవకలు జరగలేదని ఆయన చెప్పారు. పెదనందిపాడు బల్క్ మిల్క్ కలెక్షన్ సెంటర్‌కు చెందిన 260 సిమెంట్ బస్తాలను పమిడివారిపాలెం గ్రామ సచివాలయ నిర్మాణానికి వాడుకున్నారని, వాటిని రికవరీ చేయాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్‌కు సూచించారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లు రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించడం లేదని, వేలిముద్రలు, సంతకాలు తీసుకోకుండా కూలీలకు నగదు చెల్లిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని పీడీ సిబ్బందికి సూచించారు. ఎంత ఎక్కువ మంది కూలీలు పనిచేస్తే అంత ఎక్కువ గ్రాంటు గ్రామాలకు వస్తుందని, వాటిని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి, ఎంపీడీవో రాజగోపాల్, ఏపీడీ శివన్నారాయణ, ఎస్టీఎం కోనయ్య, ఎస్‌ఆర్పీ రాజు, ఎంపీపీ హెప్సిబా, సర్పంచ్ దాసరి పద్మారావు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, డీఆర్పీలు, ఉపాధిహామి సిబ్బంది పాల్గొన్నారు.

‘విజ్ఞాన్’లో బయోటెక్నాలజీ కోర్సు ప్రారంభం



చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్శిటీలో పీజీ డిప్లమో ఇన్ బయోటెక్నాలజీ కోర్సును ప్రారంభిస్తున్నామని వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ గురువారం తెలిపారు. కోర్సుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. బీఎస్సీ లైఫ్ సైన్సెస్ (బోటనీ, జువాలజీ, మైక్రో బయోలజీ, బయోటెక్నాలజీ, బయోకెమిస్ట్రీ) పూర్తిచేసిన విద్యార్థులు ఈ కోర్సుకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మారుతున్న ఇండస్ట్రీ అవసరాలకు అనుగుణంగా బీఎస్సీ పూర్తిచేసిన విద్యార్థులను తీర్చిదిద్దటానికే ఈ కోర్సును డిసెంబర్ నుంచి ప్రారంభిస్తున్నామన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు వివరాలకు 90003 90204, 80199 63972 సంప్రదించవచ్చని తెలిపారు. ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.

వ్యక్తిపై ఇనుపరాడ్‌తో దాడి

ప్రత్తిపాడు: పాత కక్షలతో వ్యక్తిపై ఇనుపరాడ్‌తో దాడికి పాల్పడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు వివరాల మేరకు.. ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెం గ్రామానికి చెందిన కాంద్రు దిలీప్ కుమార్ గుంటూరులోని మిర్చియార్డులో మిర్చి వ్యాపారం చేస్తుంటాడు. ఈ నెల 22న స్వగ్రామంలోని తన ఇంట్లో చిన్న చిన్న మరమ్మతు పనులు చేస్తున్నాడు. ఆ సమయంలో పాత గొడవలు కారణంగా అదే గ్రామానికి చెందిన క్లెం పరిశుద్ధరావు, క్లెం సుకుమార్, మరో ముగ్గురు కలిసి దిలీప్ కుమార్‌పై ఇనుప రాడ్‌తో దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారు. పెద్ద మనుషులు మాట్లాడినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో గురువారం బాధితుడు ప్రత్తిపాడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ప్రత్తిపాడు ఎస్ఐ డి. రవీంద్ర బాబు తెలిపారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ దాసరి అన్నమ్మ



గొట్టిపాడు పీహెచ్‌సీలో జరుగుతున్న హెచ్‌డీఎస్ సమావేశం

పెదగొట్టిపాడు (ప్రత్తిపాడు): రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ దాసరి అన్నమ్మ అన్నారు. మండల పరిధిలోని పెదగొట్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కెజియాగ్రేస్ అధ్యక్షతన హెచ్‌డీఎస్ సమావేశం జరిగింది. ఆస్పత్రిలోని సమస్యలు, ప్రజారోగ్యానికి తీసుకోవలసిన మెరుగైన చర్యలు, గ్రామీణ ప్రాంత ప్రజలకు అందిస్తున్న, అందించాల్సిన వైద్యసేవలపై కమిటీ సభ్యులు చర్చించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని వైద్యాధికారులకు సూచించారు. ఆస్పత్రికి సంబంధించిన అవసరాలు, కొనుగోళ్లపై కమిటీ సభ్యులు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా ఆస్పత్రి కమిటీ సభ్యులు కొత్తమల్లాయపాలెం సర్పంచ్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులను తీసుకొస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో వైస్ ఎంపీపీ షేక్ అఫ్రినాసుల్తానా, ఎంపీడీవో ఎ. శ్రీరమ్య, తహశీల్దారు సిద్దార్థ తదితరులు పాల్గొన్నారు.

వేళాపాళా లేదు.. ప్రాణాలంటే లెక్కలేదు

- ఇటీవల అధికమైన ట్రాక్టర్ ప్రమాదాలు
- నగరంలోకి అడ్డగోలుగా వస్తున్నా పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు
- జిల్లాలో సుమారు 8వేలకు పైగా ఎఫ్‌సీ లేని ట్రాక్టర్లు
- కాసుల కోసం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న రవాణా శాఖ అధికారులు



అమరావతి రోడ్డులో యువకుడి మృతికి కారణమైన ట్రాక్టర్ (ఫైల్)



సెల్‌ఫోన్ మాట్లాడుతూ ట్రాక్టర్ నడుపుతున్న డ్రైవర్

పట్నంబజారు: అధికారుల నిర్లక్ష్యానికి ట్రాక్టర్ల ప్రమాదాలు అద్దం పడుతున్నాయి. ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. కళ్ల ముందే నిబంధనలకు తిలోదకాలిస్తున్నా ధృతరాష్ట్రుడిని తలపించేలా వ్యవహరించడంపై సర్వత్రా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న తంతును అరికట్టాల్సిన అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

వేలల్లో ఎఫ్‌సీ లేని ట్రాక్టర్లు

గుంటూరు జిల్లాలో మొత్తం 16,712 ట్రాక్టర్లు ఉన్నాయని అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో సుమారు 8వేలకు పైగా ట్రాక్టర్లు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు (ఎఫ్‌సీ), బ్రేక్ లేకుండా ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. స్కూల్ బస్సులు, మిగతా వాహనాలపై దృష్టి సారించిన రవాణా శాఖ అధికారులు, ట్రాక్టర్లను పట్టించుకోకపోవడంలో ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదు.

ఈ ఏడాదిలో కేవలం 223 కేసులు మాత్రమే నమోదు చేశారంటే, అధికారుల నిర్లిప్తత అర్థమవుతోంది. కొంత మంది అధికారులకు నేరుగా ఆయా ట్రాక్టర్ల యజమానుల నుంచి పెద్దఎత్తున మామూళ్లు అందుతుండటంతోనే కనీసం అటు వైపు చూడటంలేదనే ఆరోపణలు ఉన్నాయి. స్వర్ణ భారతీనగర్‌లోని డీటీసీ కార్యాలయం ఎదురుగానే ట్రాక్టర్లు తిరుగుతున్నా, కాసుల మోజులో కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నగరంలో యథేచ్ఛగా మద్యం తాగి, సెల్‌ఫోన్లు మాట్లాడుతూ ట్రాక్టర్లను నడిపేస్తున్నారు. వారిలో సగానికి పైగా డ్రైవర్లకు లైసెన్స్‌లు కూడా లేవని చెబుతున్నారు.

ఇవిగో దారుణాలు

- కొద్ది రోజుల కిందట ఒక హోటల్‌లో పని చేసుకునే యువకుడు అమరావతి రోడ్డులో ప్రయాణం చేస్తున్నాడు. మధ్యాహ్నం 2.30 సమయంలో అటుగా వస్తున్న ట్రాక్టర్ ఢీ కొట్టడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. ఆ ట్రాక్టర్ స్టేషన్‌కు తరలించి పరిశీలిస్తే.. ఫిటెనెస్ సర్టిఫికెట్ (ఎఫ్‌సీ, బ్రేక్), ఇన్స్యూరెన్స్ లేకపోవడం గమనార్హం. దీంతో మృతి చెందిన బాధిత కుటుంబానికి ఎటువంటి న్యాయం జరగకపోవడం బాధాకరం.
- కొద్ది రోజుల కిందట వృద్ధ దంపతులు కారులో ప్రయాణిస్తున్న క్రమంలో పూటుగా మద్యం తాగిన ట్రాక్టర్ డ్రైవర్ వెనుక నుంచి వచ్చి కొరిటిపాడు సెంటర్‌లో ఢీకొట్టాడు. దీంతో వెనుక భాగమంతా పూర్తి నాశనమైపోయింది.
- చుట్టుగుంట సెంటర్ నుంచి లాలుపురానికి వెళ్లే వీఐపీ రోడ్డులో సైతం ఒక ట్రాక్టర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో సదరు వాహనదారుడుకు తీవ్ర గాయాలపాలయ్యాడు. అయితే, వారు రాజీ కుదుర్చుకోవడంతో ఎటువంటి కేసు నమోదు కాలేదు.
- అదే రోడ్డులో ఒక లారీ కారు ఢీకొట్టిన కేసులో, ఇప్పటికీ ఆ లారీ ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలోనే ఉంది. ఈ ఘటనలన్నీ నిబంధనలకు విరుద్ధంగా సమయాన్ని, వేళలు పాటించకుండా జరిగినవే. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 9 గంటలకు వరకు ఎటువంటి భారీ వాహనాలు రాకూడదనే నిబంధనలు ఉన్నా.. పట్టించుకునే దిక్కు లేకుండా పోయింది.

రాంగ్ రూట్‌లో..

నగరంలో ట్రాఫిక్ విభాగం పరిస్థితి చెప్పాల్సిన పని లేదు. డబ్బులిస్తే చాలు.. ఎన్ని వాహనాలైనా సమయ వేళలు పాటించకుండా తిరగొచ్చు. ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి సుమారు 20 వాహనాలకు మాత్రం అధికారులు నగరంలో తిరిగే అవకాశం కల్పించారు. అయితే, ఏ వాహనం గురించి అడిగినా అది ప్రభుత్వ పని కోసం అని చెప్పడం పరిపాటిగా మారింది. ఇటీవల జరిగిన ప్రమాదాలన్నీ ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల్లోపు మాత్రమే. పేరేచర్ల, అమరావతి రోడ్డు, ఇన్నరింగ్ రోడ్డు, బుడంపాడు హైవే, గుజ్జనగుండ్ల, కాకాని రోడ్డుతో మరి కొన్ని ప్రాంతాల నుంచి లారీలు, ట్రాక్టర్లు సమయ వేళలు రాకుండా నిత్యకృత్యమే. నిబంధనల్ని పాటించకపోతే చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్న మాటలు నీటిపై ''కాసు''లుగా మారిపోతున్నాయి. ఇటీవల జరిగిన ట్రాక్టర్ రోడ్డు ప్రమాదంలో రూ. 25వేలు తీసుకుని డ్రైవర్‌కు స్టేషన్ బెయిల్ ఇచ్చి సాగనంపడం గమనార్హం.

ఫిట్‌నెస్ లేకుంటే చర్యలు



ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు లేకుండా వాహనాలు తిరిగితే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించం. తనిఖీలు ముమ్మరం చేసి.. ట్రాక్టర్లకు జరిమానాలు విధిస్తాం. ఇప్పటికే పలు జరిమానాలు విధించిన పరిస్థితులు ఉన్నాయి. ఎఫ్‌సీ, త్రైమాసిక పన్నులు చెల్లించని ట్రాక్టర్‌లను సీజ్ చేస్తాం.

– షేక్ కరీం, డీటీసీ, గుంటూరు జిల్లా

చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం



సమయ వేళలు పాటించకుండా నగరంలోకి ట్రాక్టర్లు, భారీ వాహనాలు ప్రవేశిస్తే, చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. కచ్చితంగా జరిమానాలు విధించడంతో పాటు అధిక జరిమానాలు ఉంటే సీజ్ చేస్తాం. ఇప్పటికే ఈస్ట్, వెస్ట్ సబ్ డివిజన్ల సీఐలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. ట్రాక్టర్లు సమయవేళలు పాటించేలా చర్యలు తీసుకుంటాం.

– ఎం. బాలసుందరరావు, డీఎస్పీ, ట్రాఫిక్

చికిత్స పొందుతూ కంచికచర్ల వ్యక్తి మృతి

ప్రత్తిపాడు: మనస్థాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం పరిటాల గ్రామానికి చెందిన అంగజాల సత్యనారాయణ (36) ఐదేళ్ల క్రితం భార్య పిల్లలతో కలిసి గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం చిన కోంద్రుపాడు గ్రామానికి బతుకుదెరువు కోసం వలస వచ్చాడు. సత్యనారాయణ పొగాకు కంపెనీలో ఉద్యోగం చేస్తుండగా, అతని భార్య స్థానిక ఐటీసీలో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. రెండు నెలల కిందట సత్యనారాయణ సోదరి నాగమణి గుండె పోటుతో మృతి చెందింది. దీంతో సత్యనారాయణ కొద్దిరోజులుగా పనులకు వెళ్లకుండా తనలో తానే బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 14న అర్ధరాత్రి గుళికల మందు తిన్నాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు సత్యనారాయణను చికిత్స నిమిత్తం స్థానిక కాటూరి ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వ అస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సత్యనారాయణ మృతి చెందాడు. మృతుని తల్లి అంగజాల పద్మావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ప్రత్తిపాడు ఎస్ఐ డి. రవీంద్రబాబు తెలిపారు.

కాలువలో పడి వృద్ధుడి మృతి

గుంటూరు ఈస్ట్: కాలువలో పడి వృద్ధుడు మృతి చెందిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. నగరంపాలెంలోని ఆంథోని చర్చి వెనుక మునగాల రంగారావు (75) మిషన్ కుట్టుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. గురువారం తన షాపు సమీపంలోని మురుగు కాలువలో పడి మృతి చెంది ఉన్నాడు. స్థానికులు ఆలస్యంగా గుర్తించారు. రంగారావుకు బంధువులు ఎవరూ లేరని తెలిసింది. 81వ సచివాలయం వార్డు వలంటీర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మంచం మీద నుంచి పడి..

మంచం మీద నుంచి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఏటీ అగ్రహారంలో నివసించే కూరపాటి లూకా(32) బుధవారం మంచం మీద నుంచి కిందపడి మృతి చెందాడు. ఆలస్యంగా గుర్తించిన కుటుంబ సభ్యులు 108 అంబులెన్సులో ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి తండ్రి నరసింహారావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

తెనాలి రూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను అధికారులు సీజ్ చేశారు. ఎటువంటి బిల్లులు లేకపోవడంతో తెనాలి మండలం సోమసుందరపాలెం వద్ద ట్రాక్టర్‌ను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏ.వి.చలం, సిబ్బంది గురువారం గుర్తించారు. వాహన యజమానిపై కేసు నమోదు చేశారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ప్రత్తిపాడు డివిజన్
90109 57733 (ప్రత్తిపాడు)
90109 62225 (పొన్నూరు)
Office mail : sakshigntadvt@gmail.com